## క్లుప్తంగా

### బదిలీ పీఓకు సన్మానం



పీఓను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

సీతంపేట: ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా కొద్ది రోజులే పనిచేసి బదిలీపై పశ్చిమగోదావరి జేసీగా వెళ్తున్న టి. రాహుల్‌కుమార్ రెడ్డిని ఐటీడీఏ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ పి.నారాయుడు పాల్గొన్నారు.

### ముగిసిన శిక్షణ తరగతులు

గుమ్మలక్ష్మీపురం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి జరుగుతున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమేష్ బాబు మాట్లాడుతూ శిక్షణలో అందజేసిన సూచనలు పాటించి గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### ఎంపీడీఓగా పైడితల్లి బాధ్యతల స్వీకరణ



జి.పైడితల్లి

గరుగుబిల్లి : ఎంపీడీఓ జి.పైడితల్లి బుధవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లిన పైడితల్లి తిరిగి పాత స్థానానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ నందు మిగులు సీట్లు భర్తీ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మోటర్ మెకానిక్, కోపా, వెల్డర్, డ్రస్‌మేకింగ్ ట్రేడులున్నాయన్నారు. ఆశక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, 27న కళాశాలకు వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని, 29వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

### గ్రంథాలయానికి దారేది..?



శాఖా గ్రంథాలయ ప్రధాన గేట్ వద్ద పరిస్థితి

పాలకొండ రూరల్: నిత్యం పెద్ద సంఖ్యలో పాఠకులు, నిరుద్యోగ యువత క్రమంతప్పకుండా చేరుకునే సరస్వతీ నిలయానికి దారి లేకుండా పోయింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉండే శాఖాగ్రంథాలయం చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలు, అక్కడి ప్రాంగణంలో ఉన్న రక్షితనీటి పథకం నుంచి వచ్చే వృథా నీరు, పట్టణంలో సేకరిస్తున్న చెత్తను ఇక్కడే డంప్ చేయడంతో గ్రంథాలయానికి వెళ్లేందుకు కనీసం దారి కూడా లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిసరాలను పరిశుభ్రం చేసి గ్రంథలాయానికి దారి సౌకర్యం కల్పించాలని పాఠకులు కోరుతున్నారు.

### హెచ్‌ఐవీపై అవగాహన

పార్వతీపురం టౌన్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కోసం క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం. వినోద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని కొత్తవలస కొత్త పోలమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఈ క్విజ్ పోటీలు నిర్వహిస్తామని 8, 9 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

### పర్యావరణ పరిరక్షణపై శ్రద్ధ చూపాలి

పార్వతీపురంటౌన్: పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ ఎన్.సత్య ప్రసాద్ అన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బుధవారం పార్వతీపురం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వారి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని సంపూర్ణంగా ఉంచేందుకు కృషి చేయాలని కోరారు.

### అనారోగ్యంతో కార్యదర్శి మృతి

సీతంపేట: మండలంలోని కిల్లాడ పంచాయతీ గ్రామ కార్యదర్శి అల్లాడ అప్పలస్వామి (40) అనారోగ్యంతో తమ స్వగ్రామమైన ఎం.రాజపురంలో బుధవారం మృతి చెందారు. ఈయన మృతికి ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీడీఓ గీతాంజలి, ఈఓపీఆర్‌డీ కె.సత్యం, సహచర గ్రామ కార్యదర్శులు తమ సంతాపాన్ని తెలియజేశారు.



పాలకొండ రూరల్: డిగ్రీ కళాశాల నుంచి త్రివర్ణ పతకాలతో ర్యాలీ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



సీతంపేట: సీతంపేటలో ర్యాలీ చేస్తున్న అధికారులు



భామిని: అంబేద్కర్ కూడలిలో తిరంగా ర్యాలీలో మాట్లాడుతున్న మండల అధికారులు



జియ్యమ్మవలస: హర్ ఘర్ తిరంగా ర్యాలీలో తహసీల్దార్ తదితరులు

# స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- ఆర్డీఓ వెంకటరమణ
- వాడవాడలా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు

పాలకొండ: స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆర్డీఓ వెంకటరమణ అన్నారు. పట్టణంలో బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారిలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రతి గ్రామంలోనూ జెండా ఎగురవేయాలని సూచించారు. ర్యాలీలో నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, తహసీల్దార్ బాలమురళీకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎన్ఎస్ఎస్ 1, 2 యూనిట్ల ఆధ్వర్యంలో..**

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ 1, 2 యూనిట్ల నేతృత్వంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టారు. ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు త్రివర్ణ పతకాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు.

**జెండా ఎగురవేయాలి..**

సీతంపేట: మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు.



పాలకొండ: ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీఓ, కమిషనర్, తదితరులు

కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ గీతాంజలి, డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్రప్రసాద్, వీఆర్ఓ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

**భామినిలో..**

భామిని: మండల కేంద్రంలో చేపట్టిన ర్యాలీలో డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, ఈఓపీఆర్‌డీ జి.కృష్ణారావు ఆధ్వర్యంలో అధికారులు, బీజేపీ కార్యకర్తలు జై భారత్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొత్తకోట తిరుపతి, టంకాల వాసుదేవ్, కె. శంకర్, కార్యదర్శులు, వీఆర్ఓలు, వీఆర్ఏలు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు.

**హర్ ఘర్ తిరంగా ర్యాలీ**

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ తహసీల్దార్ సీతారామయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ర్యాలీలో భాగంగా ఇంటింటికి తిరంగా జెండాను అందజేశారు. ఆయనతో పాటు ఎంపీడీఓ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కొమరాడ: హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న అధికారులు

**కొమరాడలో..**

కొమరాడ: ప్రతి పౌరుడు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటి చెప్పాలని తహసీల్దార్ రమేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ బుధవారం నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరావు, సర్పంచ్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురంలో..**

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఇంటింటా త్రివర్ణ పతాకం ఎగరాలి**

గుమ్మలక్ష్మీపురం: స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఇంటింటా జాతీయ జెండా అయిన త్రివర్ణ పతాకం ఎగరాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. తపాలా శాఖ పార్వతీపురం డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవీ రమణ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను ఆమెకు బుధవారం అందజేశారు. కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పంపిన సందేశ లేఖను కూడా ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ తరింగా కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా చూడాలని ఎమ్మెల్యేకు ఆయన కోరారు. తపాలా శాఖ ఉద్యోగులు దినేష్‌కుమార్, రవి, వేణుగోపాల్, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి జాతీయ జెండాతో పాటు కేంద్రమంత్రి పంపిన లేఖను అందజేస్తున్న తపాలా శాఖ పార్వతీపురం డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమణ

## తక్షణమే స్పందించాలి..

- అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్ : అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తక్షణమే స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని స్థానిక అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలోని గాయత్రి ఒకేషనల్ కళాశాలలో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భవనాలు, ఆస్పత్రులు, జన సమూహాల్లో అగ్ని ప్రమాదాలను సమర్థవంతగా నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



అగ్ని ప్రమాదాల నివారణపై అవగహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు

## రోగులకు రక్త పరీక్షలు

భామిని: మండలంలోని గురండిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించి, రోగులకు రక్తపరీక్షలు చేపట్టారు. శ్రీకాకుళం గాయత్రీ హెల్త్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించినట్లు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నిమ్మల నిబ్బరం, మండల అధ్యక్షుడు ఆర్.కిరణ్‌కుమార్ తెలిపారు. శిబిరాన్ని గురండి, నేరడి-బి, లోహరిజోల, వడ్డంగి గ్రామాల ప్రజలు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు కిరణ్, ఎల్లయ్య, పండు, సాయి, రామకృష్ణ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

## సస్యరక్షణ తప్పనిసరి

సీతంపేట: వరిలో సమగ్ర సస్యరక్షణ చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏడీఏ రత్నకుమారి అన్నారు. మండంలోని కుడ్డపల్లిలో బుధవారం ఆమె రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. వరి పొలాల గట్లపై కంది మొక్కలు పెంచాలని సూచించారు. అనంతరం వరి పంటకు అవసరమైన నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కల్పించారు.



కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ రత్నకుమారి

## ఆశ్రమ పాఠశాల పరిశీలన

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్బందగా విద్యార్థినులతో మాట్లాడుతూ, పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. బాగా చదువుకోవాలని హితవు పలికారు. అనంతరం విద్యార్థులకు పెట్టే ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థినులు తమకు స్పోర్ట్స్ మెటీరియల్, డ్రెస్‌లు కావాలని అడగ్గా.. పీఓ వెంటనే స్పందించి వంద మందికి మంజూరు చేశారు. జ్వరంతో పాటు ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఏఎంఓ కోటిబాబు, హెచ్‌ఎం పద్మశ్రీ, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంతో పాటు విద్యార్థులకు సూచనలిస్తున్న పీఓ రాహుల్‌కుమార్ రెడ్డి

## పక్కాగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

సీతంపేట: గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీఓ నాగభూషణరావు అన్నారు. బుధవారం స్థానిక వైటీసీలో జరిగిన సర్పంచ్, గ్రామ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వ్యాధులు వ్యాపిస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. అభివృద్ధి ప్రణాళికలు, వీధి దీపాలు, ఇంటిపన్నులు, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగభూషణరావు

## సూచనలు పాటించండి

- ఏఓ వాహిని



రైతులకు మెలకువలు వివరిస్తున్న అధికారులు


పాలకొండ రూరల్: వ్యవసాయాధికారుల సూచనలు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఎన్ని వాహిని అన్నారు. మండలంలోని డోలమడలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరి నారు కొనలు తుంచి నాటడం వల్ల కాండంతొలుచు పురుగును నివారించవచ్చన్నారు. అలాగే నాట్లు వేసిన పది రోజుల తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ వెడల్పున కాలిబాట ఏర్పాటు చేయాలని సూచించారు. ఇలా చేయడం వల్ల దోమపోటు నుంచి పైరును కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వ్యవసాయ సహాయకుడు కె.అదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ తోటలకు బహిరంగ వేలం

పార్వతీపురంటౌన్: మున్సిపాలిటీ పరిధిలో గల తోటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2024–25 నుంచి 2026–27 ఆర్థిక సంవత్సరాలకు గాను తోటపల్లి హెడ్ వాటర్ వర్క్స్ ఏరియా వద్ద గల కొబ్బరి, జీడి, మామిడి చెట్ల ఫలసాయం అనుభవించే హక్కు కోసం ఈ నెల 21 ఉదయం 11గంటలకు పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాటలో పాల్గొనాలనుకున్న వారు ధరావత్తు మొత్తం, సాల్వెన్సీ ధ్రువీకరణ పత్రంతో వేలం హాజరు కావాలని తెలియజేశారు.

## భారీ వర్షం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పలు చోట్ల బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి పంట పొలాల్లోకి నీరు పుష్కలంగా చేరింది. పలు గ్రామాల్లో పంట పొలాలు నీటితో ముంచెత్తగా.. వరద నీటి ప్రవాహం వల్ల పంట పొలాల్లో ఇసుకదిబ్బలు కట్టాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కుక్కిడిలో చెరువును తలపిస్తున్న పంట పొలం

## గ్రామాభివృద్ధికి సర్పంచ్‌లే కీలకం

కొమరాడ: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లే కీలకమని, పంచాయతీ కార్యదర్శులు కీలకంగా వ్యవహరించాలని ఎంపీడీఓ మల్లికార్జునరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, చెత్త నిర్వహణ, ఎల్‌ఈడీ బల్బుల వినియోగంతో పాటు గ్రామ సమావేశాలు నిర్వహణతో పాటు వనరుల కమిటీలు వేసి గ్రామాభివృద్ధికి కచ్చితమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ఈఓపీఆర్‌డీ గోపాలకృష్ణ, ఏఓ రమేష్‌బాబు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సర్పంచ్‌ల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లికార్జునరావు

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

గరుగుబిల్లి: సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు శిక్షణలో తెలియజేసిన విషయాలను గ్రామాభివృద్ధిలో సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లకు బుధవారం మూడో రోజు ముగింపు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలన అంశాలు, సంక్షేమ పథకాల అమలుపై ఎప్పటికప్పుడు సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయం చేసుకోవాలన్నారు. అభివృద్ధి పనులలో సర్పంచ్‌లను భాగస్వాములను చేయాలన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ఎన్.అర్జున్‌రావు, పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ గోపాలరావు

## అందుబాటులోకి వెదురు కొమ్ములు

గుమ్మలక్ష్మీపురం: శరీరానికి మంచి పోషక విలువలు అందించే వెదురు కొమ్ములు లభ్యమయ్యే సీజన్ ప్రారంభమైంది. అడవుల్లో వెదురు పొదల వద్ద లభ్యమయ్యే లేత చిగుర్లనే వెదురు కొమ్ములుగా పిలుస్తారు. ఈ వర్షాకాలంలో ఇవి విరివిగా లభ్యమౌతాయి. వీటిని సేకరించిన గిరిజనులు వంటల్లో కూరగా వినియోగించుకోవడంతో పాటు విక్రయిస్తుంటారు. విలువైన కార్బోహైడ్రేట్స్, పిండిపదార్థాలు, విటమిన్లు అధిక శాతం వీటిలో ఉండటంతో వీటిని కొనుగోలు చేసేందుకు మైదాన ప్రాంతానికి చెందిన వారు సైతం ఆశక్తి కనబరుస్తుంటారు. నాలుగైదు వెదురు కొమ్ముల ముక్కలను ఒక కట్టగా కట్టి రూ.20 నుంచి 30లకు సంతల వద్ద విక్రయిస్తున్నారు.



ఏజెన్సీలో లభ్యమవుతున్న వెదురు కొమ్ములు



## నీలి.. నీలి ఆకాశం..

వరుణిడి కరుణతో నియోజకవర్గ పరిధిలో వరుసగా వర్షాలు పడుతున్నాయి. ఈ తరుణంలో అన్నదాతలు కొంతమేర సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కీలక దశలో వరికి వరుణుడి అందించిన నీటి తడులు ఆసరా కావడంతో పంట భూములు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. మరోవైపు బుధవారం వేకువజాము నుంచి వర్షం కురుస్తుండడం, ఆకాశంలో నీలి మబ్బులు సందడి చేస్తున్న సమయంలో.. మధ్యాహ్నం భానుడు పలుకరించడంతో మనోహర దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. లుంబూరు రహదారిలో కిష్టప్పకోనేరు.. ఆ వెనుక కొండలు.. ఆ పైన మనసు దోచే నీలి మబ్బులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ దృశ్యాలను పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

– పాలకొండ రూరల్